ఆమె మాట్లాడింది

చందు సోంబాబు

రైలు గట్టిగా కూత వేసి బయలుదేరింది. చెట్లు, పొలాలు వెనక్కి పరిగెడుతున్నాయి. ఫస్టుక్లాసు కంపార్టుమెంటు, అందులో ముప్పయి సంవత్సరాల స్త్రీ. ఆమె ప్రక్కనే ఒక నాలుగు సంవత్సరాల పాప కూర్చుని వుంది. ఆ స్త్రీ కిటికీ గుండా బయటకు చూస్తూ ప్రకృతిని తిలకిస్తుంది. ఆమె కెదురు బెర్తు మీద సూటులో వున్న ఒక ముప్పయి ఐదు సంవత్సరాల వ్యక్తి, ఆమె వంకే రెప్పవేయకుండా చూస్తున్నాడు. ఆమెను చూచి అతడు ఏదో ఫీలవుతున్నాడు. ఎక్కడో చూసినట్టు వుంది. చదువుకున్నదానిలానే ఉంది.

" ఎక్స్క్యూజ్ మీ, మీ పేరు తెలుసుకోవచ్చా,'' అడిగాడు.

ఆమె నెమ్మదిగా అతని వైపు చూసింది.

అవే చూపులు, అవే కళ్ళు, ఏదో గుర్తుకొస్తుంది. కానీ, కానీ ఎవరు ? ఎవరామె ? అతనికి ఆత్రుత ఎక్కువయింది. ఆమె ఏమీ మాట్లాడకుండానే చూపుల్ని కిటికీ గుండా బయటకు ప్రసరించింది. అతనికి మరీ ఆసక్తి కలిగింది. పిలిచినా పలుక లేదు. ఎవరు ? అదే అతని ఆలోచన. ఆమె తెల్లటి మెడ మీద నల్లటి పుట్టుమచ్చ కనబడింది. అంతే ఒక్కసారి షాక్ తిన్నాడు. ఎవరి వల్లయితే కాలేజీలో తన పరువు పోయిందో, ఎవరివల్లయితే తన ప్రేమ తిరస్కరించ బడిందో, ఆమె, ఆమె ' లత ! లత' అదేమాట అప్రయత్నంగా అతని నోటి వెంట వెలువడింది. ఆమె ఒక్కసారి అతన్ని చూచి మళ్ళీ చూపుల్ని మార్చేసింది. అవును ఆమె తనతో మాట్లాడదు. అవును ఎందుకు మాట్లాడుతుంది. ఒకచోట చదివేటప్పుడే మాట్లాడ లేదు. ఎప్పుడు ఎప్పుడు మాట్లాడుతుందా, మాట్లాడదు, ఆమె మాట్లాడదు. ఒక్కసారి పసిపాప వైపు చూచాడు. పాప నవ్వింది. అతను నవ్వాడు. అతను పరీక్షగా చూశాడు. అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు. అప్పుడు సన్నగా పొడుగ్గా వుండేది. రెండు జడలు, కాళ్ళకి హవాయి స్లిప్పర్సు, చెవులకు రింగులు, కుడిచేతికి చిన్న రిస్టువాచీ, ఎడం చేతికి రెండు బంగారు గాజులు, మెడలో చిన్న చైను. సాధారణంగా కటావ్ వాయిల్ చీరలు కట్టేది. పమిటని భూమి వరకు జారేసేది. అందుచేతనే అప్పట్లో ఆమెను ' కాలేజి స్వీపర్.' అనేవాళ్ళు అంతా. కానీ ఇప్పుడు, జడను చుట్ట చుట్టడంవల్ల వేసుకుంది. రెండు చేతులకి బంగారు గాజులు, మట్టి గాజులూ వున్నాయి. కాళ్ళకి మెట్టెలు, మెళ్ళో మంగళ సూత్రాలు తళ తళ లాడు తున్నాయి. ఆకుపచ్చ సిల్కుచీర కట్టింది. ఆ స్టైల్ అంతా ఏమయి పోయిందో మరి. ఏమిటబ్బా ఈ మార్పు. సరిగ్గా ఆమెను చూచి ఇప్పటికి పది పన్నెండు సంవత్సరాలు దాటింది.

" ఇప్పుడు మీరెక్కడుంటున్నారు ? మీవారేం చేస్తున్నారు ? "

" నేను చేసిన అపరాధమేమిటి, మీతో మాట్లాడటానికి కూడా తగనా, అప్పటికీ ఇప్పటికీ కూడా మీలో మార్పు రాలేదా ? "

" . . . ."

" విద్యార్థి దశలో అలా తిరగడం అల్లర్లు చేయటం అది ఎప్పుడూ జరిగేదే, మీరు అంత ఆగ్రహిస్తే," ఆమె ముఖం చూడాలని మధ్యలో ఆపాడు.

" — — — — " ఆమె కనీసం అతని వంక కూడా చూడలేదు. అతను మౌనంగా కూర్చున్నాడు, ఆమె వంక చూస్తూ. అతని ఆలోచనలు అనాలోచితంగా పన్నెండు సంవత్సరాల వెనక్కి తిరిగింది.

అవి వాళ్ళు కాలేజీలో చదువుకునే రోజులు. తను ఏ విషయంలోనైనాసరే, కాలేజీలో పేరు మోసిన హీరో. 'లత ' అతని క్లాసుమేటు. ఆమెను అభిమానించేవాడు. తను కూడా సినిమాల్లో హీరోలాగే చేస్తే ఆమె తనని ప్రేమిస్తుందని ఆమె వెంటపడి గొడవ చేసేవాడు. ఆమె ఏ సినిమాకి వెడితే ఆ సినిమాకి వెళ్ళేవాడు. ఆమె సినిమాకి వస్తుందోరాదో అని గేటు వద్ద బీటు వేసేవాడు. అతను అసలు ఆమెని ప్రేమిస్తం మొదలు పెట్టింది ఆమె తిట్టిం తర్వాతనే. ఒకసారి లత వెళుతుంటే ఎవరీమె జట్ ఫైటరా లేక కటావ్ వాయిల్ సుందరీ అన్నాడు. సమాధానంగా ' ఇడియట్ ' అని వెళ్ళి పోయింది. అప్పట్నించి వెంట పడడం మరీ ఎక్కువయింది. ఎక్కడేనా కనిపిస్తే పలకరింపుగా నవ్వడం, ఎంతో పరిచయమున్నవాడిలా పోజు పెట్టటం చేసేవాడు. 'లత' అసలు అతని వంక కూడా చూడకుండా వెళ్ళి పోయేది. అతను అదంతా ప్రేమే అనుకున్నాడు. కాలేజీ ఎలక్షన్సు వచ్చాయి. ఎలక్షన్సులో నిలబడితే నయినా ఆమెతో మాట్లాడ వచ్చని, ప్రెసిడెంటుగా పోటీ చేశాడు.

ఆమె ఇంటికి వెళ్ళాడు. ఆమెను కోపరేట్ చేయమని.

" నమస్కారమండీ "

" . . . . "

" నేను ఎలక్షన్సులో పోటీ చేస్తున్నా, తప్పక మీరు కోపరేట్ చేస్తారని ఆశిస్తున్నా."

" . . . ."

ఆ ముఖాన్ని పరీక్షగా చూశాడు. ఏ భావమూ కనబడటం లేదు. ఒక నెంబర్ పాంప్లెట్ల కట్ట ఇచ్చాడు. అందరికీ డిస్ట్రిబ్యూట్ చేయమని. మాట్లాడకుండానే అందుకుంది.

" తప్పక మీ సహాయం లభిస్తుందని ఆశిస్తున్నా ఇక వెళ్తున్నానండీ "

" . . . ."

కనీసం తన వోటు కాదు కదా ఇతరులను కూడా వేయకుండా చేసింది. కానీ మొగాళ్ళ పలుకుబడితో పెద్ద మెజారిటీతోనే గెలిచాడు. థాంక్సు చెప్పటానికనే వంకతో మళ్ళీ ఆమె ఇంటికి వెళ్ళినా, ఇంట్లో వుండి కూడా లేదని చెప్పించింది. దాంతో అతనికి అర్థమయి పోయింది. ఆమె తనని ఎంత గాఢంగా ద్వేషిస్తుందో. ఆమెను మర్చిపోవాలని ప్రయత్నించాడు. కానీ అది సాధ్యం కాలేదు. ఆమెను అంత తేలికగా మరిచి పోవడమా. దాంతో ఇక లాభం లేదని, ఆమె తనని అసహ్యించుకుంటే తప్ప తనకి ఆమె మీద ఇష్టం పోదని మరీ అల్లరి చిల్లరిగా మొదలు పెట్టాడు. ఒకసారి సినిమాకి వచ్చింది. అతను వెళ్ళి పక్కనే సీట్లో కూర్చున్నాడు.

" సిగరెట్టు తాగచ్చా." అని అడిగాడు.

" . . . . . ." తనంటే అసలు లెక్కలేనట్టుగా ఊరుకుంది.

ఒక ఆడదానికి మగవాడంటే అంత అలుసా. సినిమాలో ఏదో సీను వచ్చింది, దీన్ని చూచి అతను:

''దీన్ని 'రెడ్ ఫోర్టు' అంటారు మీరు చూశారా ?''

''. . . . .''

''నేను ఢిల్లీ, ఆగ్రా అన్నీ తిరిగానులెండి. అప్పుడు చూశా.''

''మీరు ఢిల్లీ ఎప్పుడయినా వెళ్ళారా ?''

''. . . . .''

''ఇంతమందిలో మీరు సిగ్గుపడుతున్నట్టున్నారు నాతో మాట్లాడటానికి.''

''. . . . .''

''ప్రేయసీ ప్రియులనుకుంటారు అంతేగా''

''. . . . .'' సీరియస్‌గా ఒకసారి చూసింది. కాస్సేపు వూరుకుని మళ్ళీ,

''రేపు నా పుట్టిం రోజు. పార్టీకి తప్పకుండా రావాలి. వస్తారు కదూ ?''

లత పక్కనే ఉన్న లత అక్క రమ అంది: 'నీ తద్దినానికి తప్పక వస్తాం' దాంతో ఆ సీటు కాళీ చేసి వచ్చేశాడు. రోజులు అలాగే గడుస్తున్నాయి. అసలే ఇద్దరికీ పడక చస్తుంటే, ఒక బ్రాట్ అల్లరి కోసం గోడల మీద లతా శ్యాంసుందరుల ప్రణయ వృత్తాంతం అని పెయింట్ చేశాడు. తన పరువు పోయింది. స్టూడెంట్సు యూనియన్ ప్రెసిడెంట్ అవటం వల్ల మరీ అల్లరయిపోయాడు. లత మటుకు మామూలుగానే ఉంది. అసలేమీ ఎరగనట్టుగానే ఉంది. అతనికి రోజు రోజుకీ ఆమె అంటే అభిమానం ప్రేమ పెరిగి పోవడం మొదలు పెట్టాయి. కొన్ని రోజుల తర్వాత ప్రిన్సిపాలు పిలిచి తిట్టాడు లతను ఏడిపిస్తున్నాడనే ఆరోపణతో. అతను బల్లగుద్ది వాదించాడు.

''దాన్ని ఏడిపిస్తం అనరు. ప్రేమిస్తం అంటారు'' అని.

''షటప్'' అని అరచాడు ప్రిన్సిపాలు గట్టిగా.

''స్టూడెంట్సు యూనియన్ ప్రెసిడెంటువి నీవే ఇలాటి పనులు చేస్తే ఇక ఎవరు వింటారు. నిన్ను ఒక వారం సస్పెండు చేస్తున్నా'' అన్నాడు. అది చాలక ప్రతి క్లాసుకూ నోటీసు పంపాడు. పుణ్యాత్ముడు ఆయన చలవా అంటూ ఉన్న పరువు కాస్త కాంసంట్రేటెడ్ ఇసుకలో కలిసి పోయింది. తర్వాత అతనితో వైరాగ్యం కలిగింది. ఒక్క ఆడదానివల్ల కదా, పేరు గోడ లెక్కిందీ, ప్రిన్సిపాలు తిట్టిందీ, సస్పెండు చేసిందీ, అసలు ఆడదాన్ని ప్రేమించకూడదు, అసలు మాట్లాడనే కూడదు. మళ్ళీ అనిపిస్తుంది ఆమె ప్రేమించక పోతే పోనీ కనీసం మాట్లాడ కూడదు. ఒక్క చిరునవ్వు నవ్వరాదూ ? అదైనా చాలుకదా ఈ అదృష్ట హీనుడికి. ఇది జరిగిన ఒక నెల తర్వాత బొటానికల్ టూరుకు వెళ్ళారు. కనీసం అక్కడైనా మాట్లాడదా అని అభిప్రాయం. ఆమె ప్రేమించక పోతే, పోనీ, తనతో ఒక్క మాట మాట్లాడితే, అదే ఈ జన్మకి చాలు. ఎలాగైనా ఆమెని పలకరించాలి.

ఒక కాలవ పక్క నుంచి నడుస్తున్నారు. లత కాలుజారి నీళ్ళలో పడింది. అతను గబుక్కున నీళ్ళల్లోకి దూకి ఆమెను రెండు చేతులతో పట్టుకున్నాడు. ఎప్పుడూ తనతో మాట్లాడక పోయినా,

తనవరకు ఆమె చూడక పోయినా, ప్రస్తుతం ఆమె అతని చేతులలో ఉంది. ఒక చెయ్యి ఆమె నడుం చుట్టూ వేసి గట్టిగా పట్టుకుని, "భయం లేదు నేను వచ్చాగా."

"................"

"జాగ్రత్తగా పట్టుకోండి, పడ్డాక్క తీసుకెళ తాను."

"..............."

కనీసం థాంక్స్ కూడా చెప్పలేదు.

ఇదో శాపకారణమనిపిస్తోంది. ఆమె అస హ్యించుకున్నా, మాట్లాడక పోయినా, రిపోర్టు చేసినా కూడా అతను ప్రేమిస్తున్నాడు. కనీసం ఈ జన్మకి కాక పోయినా మరు జన్మకైనా లతా పతిని చేయమని దేవునికి మొక్కుకున్నాడు. అసలు తనకేం తక్కువ. అందం లేదా, చదువులేదా, డబ్బు లేదా, ఏ ఎందుకు ప్రేమించదు, నాకంటే మంచి మొగుడు వస్తాడా అసలు అని. ఇదే ప్రశ్న కొందరిని అడిగితే నీకు తలకాయలేదు. మాట్లాడటం రాదు అని అన్నారు. అసలు ప్రేమించే విధం అదికాదని, గిలా, అలా అని హితోపదేశించిన వారు కొందరు, (అరి తేరిన ఘటాలు) అన్నీ విని కేక్కినా, ఆమెని చూసేసరికి ఈ ప్రపంచం, కాలేజీ అన్నీ మర్చి పోతాడు. కారణం, ఆ అమాయకపు చూపులు, ఆ చూపుల్లోనూ, కళ్లల్లోనే ఉంది ఆ అమ్మాయి అందమంతా. ఏమీ పట్టించుకున్నట్టే ఉండదు. కాని అన్నీ తెలుసు.

ఆ సంవత్సరంతో బందరు చదువు అయిపోతోంది. అంటే ఇంటర్లోంచి ఇంకో వూరుకు తరవేస్తా తప్పమాట. లతని చూడకుండా ఉండగలడా ? బాబోయ్ తలచుకుంటే నే గుండెలు దడదడ లాడాయి. అంతకంటే గుండెలు పగిలే వార్త, ఇక తను ఎవరి కోసం జీవించాలి, తన బ్రతుకు వ్యర్థం. కారణం లత పెళ్లి స్థిరమయి పోయింది. ఇక ఆశ లేదు. ఆమెను మర్చి పోవాలి.

పది రోజుల్లో ఆమె పరాయి సొత్తయి పోతుంది. తనా వూరు వదిలి పోవాలి. మళ్ళా జీవితంలో లతని చూడ గలడా ? ఏమో అది సాధ్యం అవుతుందా? పెళ్ళికి సంబంధించిన విషయాలు సేకరించాలని కూడా అనిపించలేదు. పెళ్ళి తనని క్షమించమని అడగాలనుకున్నాడు. అలాచేసినా కనీసం మాట్లాడదు. అవును తను చేసిందంతా తప్పు. తను ఆమెని విసిగించాడు. అసలు ఆమె గనకే తనని అంత తేలిగ్గా వదిలేసింది, నిజంగా ఆమె ఎంత మంచిది. ఎప్పటి కప్పుడు వెళ్ళి క్షమించమని అడగాలనుకున్నాడే గాని వెళ్ళలేదు. లత పెళ్ళి అయిపోయింది. ఆమె భర్తతో పాటు వెళ్ళిపోయింది. కారు అతని ఇంటి ముందర నించే వెళ్ళింది. అతనికి పిచ్చి ఎత్తినట్టయింది. అతను ఇక లత లేని వూళ్ళో ఉండడానికి మనస్క రించక విశాఖపట్నం వెళ్ళి 'బి. యల్'లో చేరాడు. రెండు సంవత్సరాల తర్వాత 'లాయర్ శ్యాం' సుందరం'గా తిరిగి వచ్చాడు. లత గుర్తుకు రావటం వల్ల ఇక వాదించలేక రెండు మూడు కేసులు నోడి

ఆమె మాట్లాడింది

పోయాడు కూడా. ఆమె మద్రాసులో ఉంటుందని తెలుసు. కాని ఆ మహా పట్నంలో ఎక్కడని కలుసు కోవడం. కలిస్తే మాటుకూ, చూచి ఆనందించా లనిపించేది, పాత బాధల్ని గుర్తుకు తెచ్చుకుంటం తప్ప కనీసం ఒక్క మాట కూడా పలకదు. పన్నెండు సంవత్సరాల క్రితం కాలేజీలో తనకూ లతకు జరిగిన సంఘటనలన్నింటినీ కలిపి ఒక మధుర స్మృతిగా తన హృదయంలో దాచుకున్నాడు. అందం ఒక తళుకులా గుర్తు వస్తోంది అతనికి. ఆమె పెళ్ళయిన తర్వాత మళ్ళా పన్నెండు సంవత్సరాలకి ఆమెని చూశాడు. ఇప్పుడు ఆమెలో ఎంతో మార్పు కన్పిస్తోంది. అప్పటి లతకి అసలు ఇప్పుడు పోలికే లేదు. ఇప్పుడు బొద్దుగా ఎంతో నిండుగా ఉంది. అదే కారణం ఆమెని గుర్తు పట్టడానికి ఆలస్యం అవడానికి. ఇప్పుడు కూడా ఆమె తనతో మాట్లాడక పోవడం. చాలా బాధ కలిగింది. ఆఖరుసారిగా పిలవాలనుకున్నాడు.

"ఏమండీ ఒక్క మాట."

అతని వంక చూచి వూరుకుంది.

"జీవితంలో మానవుడు అనేక పొరపాట్లు చేస్తాడు. కాని వాడు చేసింది తప్పు అని తెలియ గానే పరితాపం చెందుతాడు. అట్టివారిని క్షమించడం చదువుకున్న వారి లక్షణం. ఆఖరుసారిగా పలక రిస్తున్నాను. గడచిన ఈ పన్నెండు సంవత్సరాలు నేను ఎక్కడో, మీరెక్కడో. కానీ ఒక్కసారి మనం ఈ విధంగా ఈ రైలులో కలవడం నా అదృష్టం. ఒక్క మాట చెప్పండి. ఇప్పటికి గంటున్నారు. రైలు స్పీడు తగ్గింది. నేను దిగ వల్సిన స్టేషను వచ్చేస్తోంది. ఎప్పుడైనా మీరు కనిపిస్తే క్షమించమని కోరాలనే నిరీక్షిస్తున్నాను. ఇన్నాళ్ళ తర్వాత, కొన్ని సంవత్సరాల తర్వాత ఒకరి కొకరం కనబడ్డాం. మళ్ళీ ఇప్పుడే దూరమవు తున్నాం. రైలు ఆగింది. ఇక నేను దిగిపోవాలి. నన్ను క్షమించండి." అని, భారంగా పసిపాప వేపు చూశాడు. ఒక్కసారి చేతుల్లోకి తీసుకుని, ముద్దులతో ముంచే శాడు; పాప ఉక్కిరి బిక్కిరి అయింది.

జేబులోంచి ఒక నోటు తీసి పాప చేతిలో పెట్టాడు. పాప గట్టిగా పట్టుకుంది, పాపని మళ్ళా వదలి, ఆమె వంక చూశాడు. ఆమె లోన ఏదోగా బాధ పడు తున్నట్టు అనిపించింది అతనికి. "ఇక నే వెళ్తు న్నాను. క్షమించండి" అని రెడ్ సూట్‌కేసు పట్టుకుని క్రిందికి దిగాడు.

వెనక నుంచి—

"ఏమండీ" అన్న సన్నని కంఠం వినిపించింది. దేనికోసమైతే తాను కాలేజీలో నాలుగేళ్ళు, తర్వాత పన్నెండేళ్ళు గడిపాడో అదే ఎదురయింది. ఆ కంఠంలో అనేక కోకిల కంఠాలు విన్నాడు. ఆనం దంతో వెను తిరిగాడు.

ఆమె తలుపువద్ద నిలబడి ఉంది.

ఆ ఆనంద సమయంలో ఏమి మాట్లాడాలో తెలీక;

"ఏమండీ" మళ్ళీ పిలిచింది.

'ఊ. . .' అన్నాడు ఉక్కిరి బిక్కిరవుతూ.

వాలుగా కళ్ళు కలిశాయి. ఇద్దరూ మాట్లాడే స్థితిలో లేరు. రైలు గట్టిగా కూత వేసి బయలు దేరింది. వాళ్ళిద్దరినీ వేరుచేశానన్న బాధతో, అతను చెయ్యి వూపుతుండగానే రైలు కనుమూస్తు మరుగైంది. తన కదే చాలు అనుకున్నాడు. అదే. . . ఆమె మాట్లాడింది. ★